క్లుప్తంగా

ఉపాధి పనులకు సామాజిక తనిఖీ


మాట్లాడుతున్న లవరాజు

పాతపట్నం: మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీలు చేపడుతున్నట్టు జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు చెప్పారు. రూ.14 కోట్లు ఖర్చుకు సంబంధించి నిర్వహించే ఆడిట్‌కు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎస్‌ఆర్పీలు, డీఆర్పీలు, సాంకేతిక సహాకులు, క్షేత్రసహాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో జయంత్ ప్రసాద్, ఏపీవోలు రవి, సురేష్‌లు, ఈవోపీఆర్డీ ప్రసాద్ పండా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్.ఎన్.పేట: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ నీతూ అన్నారు. తురకపేట గ్రామంలో వ్యాధుల నియంత్రణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, వైరల్ జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు దోమల నివారణపై దృష్టి సారించాలన్నారు. ఇంటిని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ర్యాలీలో ఎఎన్ఎం ఆరుద్ర, మేల్‌హెల్త్ వర్కర్ ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే


పెనుబర్తి సచివాలయంలో తనిఖీలు చేస్తున్న ఎంపీడీవో హరిహరరావు

పొందూరు: ఓటర్ల సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో సీపాన హరిహరరావు అన్నారు. మండలంలోని కింతలి, కనిమెట్ట, మొదలవలస, పెనుబర్తి గ్రామాల్లో ఇంటింటి సర్వేను, సచివాలయాలను శుక్రవారం పరిశీలించారు. సర్వేను పక్కాగా చేపట్టి ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు. సచివాలయాలకు ఆలస్యంగా వస్తున్న సిబ్బందిని మందలించారు.

కూలిన ఇంటి గోడ


గోడ కూలిన దృశ్యం

జలుమూరు: ఇటీవల కురిసిన వర్షాలకు బొడ్డపాడులోని కోనేటి రమణమూర్తికి చెందిన ఇంటి గోడ గురువారం అర్ధరాత్రి సమయంలో కూలిపోయింది. గోడ కూలిన సమయంలో ఎవరూ ఇంట్లో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏదైనా ప్రమాదం జరుగుతుందన్న అనుమానంతో కుటుంబ సభ్యులంతా బంధువుల ఇంటిలో పడుకోవడంతో ప్రాణాలు రక్షించుకున్నామని రమణమూర్తి తెలిపారు. బాధితులను సర్పంచ్ అంపోలు భాను, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరావులు శనివారం పరామర్శించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నరసన్నపేట: విద్యార్థి దశలో క్రమశిక్షణ ఎంతో అవసరమని శ్రీవిజయం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డేని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంత క్రమశిక్షణగా ఉంటే అంత మంచి స్థాయికి వెళ్తారన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఇంటర్ విద్య కీలకమన్నారు. మారుమూల గ్రామాల విద్యార్థులకు మంచి విద్యను అందించాలన్నదే తమ పాఠశాల లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

వరదలోనే పొలాలు


నరసన్నపేట కుద్దాం-మామిడివలసల్లో నీటిలో ఉన్న తంపర భూములను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

నరసన్నపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాలను వరద ముంచెత్తింది. వర్షాలు తగ్గుముఖం పట్టి రెండు రోజులైనప్పటికీ పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. శుక్రవారానికి కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. ఇప్పటికీ వందలాది ఎకరాల్లో నీరు నిలిచే ఉంది. వెద పొలాలు, నారు మడులు నీటిలోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బొరిగివలస, రావులవలస, బసివలస, మామిడివలస, కుద్దాం, నర్శింగపల్లి, కంబకాయ, ఉర్లాం తదితర గ్రామాల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంది. దీంతో వెద పొలాల్లో వరి మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని అన్నదాన ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

వ్యవసాయాధికారుల పరిశీలన..

వరదనీటితో నిండిన వరి పొలాలను నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత శుక్రవారం పరిశీలించారు. మామిడివలస, బసివలస తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పారు. నీరు తగ్గిన వెంటనే వరి నారుకు, వెద పొలాల్లో పిలకలకు పోషకాలు అందించాలని సూచించారు. మళ్లీకే వంద గ్రాములు.. ఫార్ములా ఫోరు 50 గ్రాములు, కేజీ యూరియా కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే చిక్కాలవలసలో పొలంబడి నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

ఆమదాలవలస రూరల్: మండలంలో కొర్లకోట, కొత్తవలస, చీమలవలస, హనుమంతుపురం, తొగరాం, దూసి, తోటాడ గ్రామాల్లో వరి వెదలకు ముంపు నుంచి విముక్తి కలగలేదు. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపునీరు పోటెత్తడంతో పంటపొలాలు నీటిమునిగిపోయినట్లు రైతులు చెబుతున్నారు. వర్షాలు ఎక్కువగా కురవడం వలన నారాయణపురం ఎడమ సాగునీటి కాలువ ఉధృతంగా ప్రవహించడంతో పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. వేలాది ఎకరాల వరిపొలాలు రెండు రోజులుగా నీటిలోనే ఉండడంతో నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

భారీ వర్షాల కారణంగా పొలాలు ముంపునకు గురికావడంతో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు సూచించారు. చీమలవలస గ్రామం సమీపంలో ముంపునకు గురైన పంటపొలాలను శుక్రవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరద నీరు పొలాల నుంచి తీసివేసిన వెంటనే పొటాషియం నైట్రేట్‌ను వరికి పిచికారీ చేయాలన్నారు ముంపు కారణంగా పంటపొలాలకు ఎక్కువ నష్టం జరిగితే స్వల్పకాలిక వరి విత్తనాలను దమ్ముపట్టి పొలంలో నేరుగా వేదగా వేసుకోవచ్చునన్నారు. వర్షాలు కారణంగా వరి వెదలు కుళ్లిపోయే స్థితికి చేరుకోకుండా ముందస్తుగా నీటిని పొలం నుంచి తరలించే మార్గాలను ఎంచుకోవాలన్నారు.


ఆమదాలవలస రూరల్: చీమలవలస వద్ద ముంపునకు గురైన పంటపొలాలు


ఆమదాలవలస రూరల్: కొత్తవలస వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నారాయణపురం ఎడమ కాలువ


ఆమదాలవలస రూరల్: ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఏవో మోహనరావు

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం


కొమ్మువలసలో సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- తోటవాడ పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బూర్జ: ప్రజాశ్రేయస్సే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకు ఆర్థిక తోడ్పాటు అందుతోందన్నారు. తోటవాడ పంచాయతీ పరిధి కొమ్మువలస, టీఆర్ రాజుపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా కొమ్మువలస గ్రామంలో భద్రమ్మ చెరువుకు రెండున్నర లక్షల రూపాయలతో నిర్మించిన మెట్లను ప్రాంభించారు. అలాగే కొమ్మువలస గ్రామంలో సుమారు రూ. 12 లక్షలతో, టి.ఆర్.రాజుపేట గ్రామంలో రూ. 42 లక్షలతో చేపట్టనున్న జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని తెలియజేశారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరారావు, ఏపీ టిడ్కో డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, మండల సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, ఎంపీడీవో ఎం.రవీంద్రబాబు, తహసీల్దారు ఎస్.రమణారావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, కర్నం కృష్ణమూర్తినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరామనాయుడు, బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసై వెంకటరావు, వి.మురళీకృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తప్పు మాట్లాడేవారిని తరిమి కొట్టండి


మెళియాపుట్టిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి

- ఐటీడీఏను మెళియాపుట్టి తీసుకొస్తాం
- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: తప్పుడు మాట్లాడేవారిని తరిమి కొట్టాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి అన్నారు. స్వలాభం కోసం పార్టీలు మారిన వారిని తరిమి వేయాలని పిలుపునిచ్చారు. మెళియాపుట్టి, చాపర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమం ప్రాధాన్యాన్ని వివరించారు. మహిళలకు జగనన్న ప్రభుత్వంలో పెద్దపీట వేశారన్నారు. ఐటీడీఏను మెళియాపుట్టిలో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్టు ఈ సందర్భంగా వెల్లడించారు. టీడీపీ వాళ్లు ఇచ్చిన ప్యాకేజీకి అమ్ముడుపోయి నియోజకవర్గాన్ని రావణ కాష్టంలా మార్చిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అని మండిపడ్డారు. రాజకీయ భిక్షపెట్టిన జగనన్నను మోసం చేశారన్నారు. బస్సు యాత్రల పేరుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని, మహిళా ఎమ్మెల్యే అయిన తనను విమర్శించడం మహిళలపై ఆ పార్టీ నాయకులకు ఏమాత్రం గౌరవం ఉందో తెలుస్తోందన్నారు. ఇటువంటి వారిని ప్రజల్లో తిరగనీయవద్దని మహిళలకు పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని ఆ పార్టీని నాయకులు దోచుకుని పంచుకుతిన్నారని ఆరోపించారు. గతంలో పింఛన్లు, ప్రభుత్వ పథకాలు రావాలంటే టీడీపీ జెండామోస్తేనే ఇచ్చేవారని.. ప్రస్తుత ప్రభుత్వంలో ఎవరిదగ్గర చేతులు కట్టుకోవాల్సిన అవసరం లేదని అర్హత ఉంటే చాలన్నారు. మళ్లీ టీడీపీ వారికి అవకాశం ఇచ్చి, అవసరాల కోసం జన్మభూమి కమిటీల వెంట తిరుగుతామా? అని ప్రజలను ప్రశ్నించారు. ఈమధ్యకాలంలో వైఎస్సార్‌సీపీ నాయకులమని చెప్పి కొంతమంది నియోజకవర్గంలో ముసుగుదొంగలు తిరుగుతున్నారని.. వారి మాటలను నమ్మవద్దని, ప్రలోభాలకు లొంగొవద్దని కోరారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. చాపర, మెళియాపుట్టి సర్పంచ్‌లు బోసి రామారావు, రేఖాన లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాం మిన్ని, జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, జేసీఎస్ కన్వీనర్ జయమునిరావు, శశిభూషణరావు, తహసీల్దార్ సరోజిని, ఎంపీటీవో చంద్రకుమారి పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకురావాలి

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: రక్తదానానికి అందరూ ముందుకు రావాలని స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడినవారమవుతామన్నారు. స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద రామదాస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మోక్షా రక్తనిధి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసన్నపేటలో రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో మంచి ప్రయత్నమన్నారు. దీనిని సక్రమంగా నిర్వహించాలన్నారు. పేదలకు ప్రయోజనకరంగా ఉండాలని ఆకాంక్షించారు. కేంద్రంలో ఎప్పుడూ రక్తం అందుబాటులో ఉండాలంటే దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన చారిత్రాత్మకం


జలుమూరు: అల్లాడలో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే కృష్ణదాస్

జలుమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చారిత్రాత్మకమని నరసన్నపేట శాసనసభ్యుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూస్తోందన్నారు. అల్లాడ, సైరిగాం సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. సంక్షేమ సారథి.. సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, పి.రాజప్పలనాయుడు, మండల సలహాదారు పైడి విఠలరావు, సర్పంచ్ బూర్లి అసిరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.అరుణమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం తదితరులు పాలొగ్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల ఉపాధిని కాపాడాలి

ఆమదాలవలస: రైల్వే కాంట్రాక్టు కార్మికుల ఉపాధిని కాపాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కోరారు. రైల్వే కార్మికుల ఆల్ ఇండియా డిమాండ్స్‌డే సందర్భంగా రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ ఆవరణలో రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీసవేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న చట్టాలను మార్చొద్దని కోరారు. రైల్వే కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు వి.ఆదినారాయణ, జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు బి.జనార్దనరావు, వివిధ సంఘాల నాయకులు బెండి సూర్యనారాయణ, టి.సంతోష్, కుమార్, పి.తిరుపతిరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ


జలుమూరు: మొక్కలు పంపిణీ చేస్తున్న కృష్ణదాస్


పాతపట్నం: కొరసవాడలో మొక్కలు నాటుతున్న దృశ్యం


నరసన్నపేట: మొక్కలు నాటుతున్న దృశ్యం

జలుమూరు: మొక్కలతో మానవ మనుగడని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని పెంచే బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. జలుమూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చిన కొబ్బరి, మామిడి తదితర మొక్కలను శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, మండల సర్పంచ్‌ల అధ్యక్షుడు దామ మన్మథరావు, ఏపీవో పట్ట సోమేశ్వరరావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కరణం గణపతిరావు, పార్టీ సీనియర్ నాయకుడు బుక్కా లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాతపట్నం: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కొరసవాడ సర్పంచ్ జక్కర ఉమా అన్నారు. కొరసవాడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. రహదారికి ఇరువైపులా మొక్కలను నాటారు. ఏఎంసీ వైస్ చైర్మన్ మడ్డు తాతయ్య, కె.లక్ష్మీనారాయణ, సీహెచ్ అప్పారావు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

మొక్కలునాటి సంరక్షించాలి

నరసన్నపేట: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని నేచర్ సేవ్ సొసైటీ అధ్యక్షుడు ఉకలాపు రంజిత్‌కుమార్ అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం పలు మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ.. మొక్కలతో పర్యావరణానికి జరగనున్న మేలును వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కోరుకొండ శాంతారావు, తంగి కృష్ణ, ఎన్ని శ్రీధర్, వైకుంఠరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

ఎల్.ఎన్.పేట: పూశాం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు శుక్రవారం భూమి పూజ చేశారు. చొర్లంగి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పూశాం గ్రామ ప్రవేశం వరకు సుమారు 200 మీటర్ల మేరకు రోడ్డును నిర్మించనున్నారు. పార్టీ నాయకుడు శివ్వాల షణ్ముఖరావు ఉన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న సంజీవరావు

కొత్తూరు: ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యతని వెలుగు ఎన్జీవో కార్యదర్శి బి.సంజీవరావు అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎన్జీవో కార్యాలయములో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి జీవి మనుగడకు గాలి, నీరు, భూమి ఆధారమన్నారు. వీటిని కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరి ఉందన్నారు. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను పంటల సాగుకు వాడాలన్నారు. మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఎన్జీవో ప్రతినిధులు దాసునాయుడు, హరీష్‌లు ప్రకృతిని ఎలా పరిరక్షించుకోవాలో అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి తిలారు రూరల్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు టెక్కలి ఈఈ ఎ.రాజశేఖర్, జలుమూరు ఏఈ వి.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. టెక్కలిపాడు, తిలారు, లింగాలవలస, నారాయణవలస, చిన్నదూగాం, పెద్ద దూగాం గ్రామాలకు సరఫరా ఉండదని..వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేపు నరసన్నపేట మండలంలో..

నరసన్నపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్ తెలిపారు. తామారాపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ సందర్భంగా నరసన్నపేట, పోలాకి మండలాల పరిధిలోని నరసన్నపేట, సత్యవరం, బొరిగివలస, జమ్ము, తామరాపల్లి, కంబకాయ, గొట్టిపల్లి, దూకులపాడు, కుసుమపోలవలస, ఈదులవలస, చీడివలస, జడూరు, పిరివాడ, యాట్లబసివలస గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


పాతపట్నం: సవర సిద్దమనుగు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ 85 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.అన్నాజీరావు, బాబూరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరుస క్రమంలో వరి నాట్లతో బహుళ ప్రయోజనాలు


వరుస క్రమంలో వరినాట్లు వేయిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: వరుస క్రమంలో వరినట్లు వేసే విధానంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ కె.గోవిందరావు అన్నారు. మాకవరంలో శుక్రవారం పొలంబడి నిర్వహించి వరుస క్రమంలో నాట్లు వేసే విధానాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ.. వరుస క్రమంలో నాట్లు వేయడం వల్ల వరి దుబ్బుకు గాలి, వెలుతురు బాగా తగలడం ద్వారా దోమలతో పాటు చీడపీడల బెడద ఉండదన్నారు. ఎరువులు వేయడానికి.. పురుగు మందుల పిచికారీకి సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాకవరం వీఏఏ పవన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ధనలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి


మాట్లాడుతున్న భూపతిరావు

పొందూరు: విద్యార్థులు చదువే ధ్యేయంగా ఉండాలని, తమ లక్ష్య సాధన వైపు ముందుకు అడుగులు వేయాలని ప్రముఖ మనస్తత్వవేత్త బొడ్డేపల్లి భూపతిరావు అన్నారు. స్పందన ఇదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మానసవేణి ఉన్నత పాఠశాలలోని తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఉద్వేగాలను నియంత్రించుకుంటూ.. భవిష్యత్తుకు మంచి బాట వేసుకోవడమెలా అనే విషయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏపీజే అబ్దుల్ కలాం, వివేకానందుడు, రామాయణం వంటి పుస్తకాలను చదివి తమ వ్యక్తిగత జీవితాలను ఉత్తమ మార్గం వైపు నడిపించుకోవాలని సూచించారు. లక్ష్యం స్పష్టంగా ఉంటే గమ్యాన్ని చేరుకోవడం సులభతరమవుతుందని చెప్పారు. లక్ష్య సాధనతోనే సమాజానికి పనికొచ్చే శక్తిగా మారుతారని చెప్పారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి


పాతపట్నం: పాతపట్నం బస్‌స్టాండ్ వద్ద విద్యార్థుల మానవహారం

పాతపట్నం: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని ఆదివాసీ నాయకులు బి.గోపాలరావు, కిరణ్‌కుమార్ అన్నారు. అక్కడి ఆదివాసీలపై జరుగుతున్న మారణహోమాన్ని అరికట్టాలని, మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మణిపూర్ మారణహోమానికి నిరసనగా పాతపట్నంలో శుక్రవారం రాత్రి ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలు, మంగళగిరిలో జరిగిన ఘటనలు సమాజానికే తలవంపులు తీసుకువస్తున్నాయన్నారు. ముందుగా బస్‌స్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిమీదుగా మార్కెట్, ఆల్ఆంధ్రరోడ్డు, ఆస్పత్రి కూడలి మీదుగా కోర్టు కూడలి వరకు విద్యార్థులతో కలిసి కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించారు.